ప్రజాశక్తి
మంగళవారం 5 జూలై, 2025
5
శ్రీకాకుళం

వెబ్‌సైట్‌లో ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుల అర్హుల జాబితా

శ్రీకాకుళం సిటీ : పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టు భర్తీకి సంబంధించి జిల్లా సెలెక్షన్ కమిటీ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం జూలై 16 నుంచి 29 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులు, అనర్హుల జాబితాలు సిద్ధం చేశామని జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఫర్మాన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతల ఆధారంగా రాత పరీక్షకు అర్హత పొందిన అభ్యర్థుల జాబితా, పరీక్షా తే, కేంద్రాల వివరాలు జిల్లా అధికారిక వెబ్‌సైట్ srikakulam.ap.gov.in ఉంచినట్లు తెలిపారు. అర్హత పొందిన అభ్యర్థులకు ఆగస్టు 5న హాల్ టికెట్లు, వారి దరఖాస్తులో పేర్కొన్న మొబైల్ నంబర్లకు వాట్సాప్ ద్వారా, అలాగే ఇమెయిల్ ద్వారా పంపించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ పేరు, హాల్ టికెట్, పరీక్ష కేంద్రం వివరాలకు జిల్లా వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

పొందూరు మండలం వావిలపల్లిపేట వద్ద నిలిచిపోయిన కాలువ తవ్వకాల పనులు

మడ్డువలస రెండో దశ పనులు పునఃప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2008లో ప్రారంభమైన ప్రాజెక్టు పనులు రకరకాల కారణాలతో ఆగిపోయాయి. 2014 అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పనులను మొదలు పెట్టింది. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2020లో అప్పటివరకు పనులు చేస్తున్న నిర్మాణ సంస్థతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. వైసిపి ప్రభుత్వం కొత్త సంస్థకు పనులను అప్పగించడంతో 2023 ఏప్రిల్‌లో మళ్లీ పనులు మొదలయ్యాయి. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, కాలువ తవ్వకాలకు అధికారులు భూమిని సేకరించినా రైతులకు డబ్బులు ఇవ్వకపోవడం తదితర కారణాలతో రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. పాత కాంట్రాక్టర్‌తో పనులు కొనసాగింపునకు ప్రభుత్వం తెలపడం, పెండింగ్ బిల్లులు చెల్లించే అవకాశాలూ ఉండటంతో పనులు పునఃప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

'మడ్డువలస' మొదలయ్యేనా?

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

- రెండేళ్లుగా నిలిచిన పనులు
- పాత కాంట్రాక్టర్‌తో పనుల కొనసాగింపునకు ప్రభుత్వం అంగీకారం
- పనుల పూర్తికి ఒప్పంద కాలపరిమితి పెంపు
- పనుల పునఃప్రారంభంపై అధికారుల్లో ఆశాభావం

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పిజెఆర్ కనస్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగు నీరందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశమిచ్చింది. చివరి సారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారికి లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో 37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జూలై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయరు పనులు చేపట్టిన పిజెఆర్ కనస్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు పనులు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25న ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎస్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కనస్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

అడుగడుగునా అవాంతరాలే

మడ్డువలస పనులను 2009లో ప్రారంభించి 2020 జూలై వరకు 78.36 శాతం జరిగాయి. రెండో దశ పూర్తి కావాలంటే మరో 21.64 శాతం పనులు పూర్తి చేయాలి. మిగిలిన పోయిన పనులను ప్రభుత్వం కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించింది. 2023 ఏప్రిల్ 24న మడ్డువలస పునఃప్రారంభ పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత కూడా మందకొడిగానే సాగుతున్నాయి. ఇది చాలదన్నట్లు పనులకు రకరకాల ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పొందూరు మండలం వి.ఆర్.గూడెం, ధర్మపురం, వావిలపల్లిపేట ప్రాంతాల్లో కాలువ తవ్వకాలకు బండరాళ్లు అడ్డురావడంతో వాటిని పేల్చి తొలగించాల్సి ఉంది.

పాత కాంట్రాక్టర్‌తోనే పనులు?

మడ్డువలస పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టకు చెల్లించాల్సిన బిల్లులు గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచడంతో పనులపై పెద్దగా ఆసక్తి కనబరచలేదు. పది కిలోమీటర్ల మేర కాలువ తవ్వాల్సి ఉండగా నాలుగు కిలోమీటర్లు తవ్వారు. కాలువపై 250 స్ట్రక్చర్లు నిర్మించాల్సి ఉండగా ఇప్పటివరకు ఒక్కటీ నిర్మించలేదు. కొత్తగా పనులు మొదలైన తర్వాత ఐదు శాతం మాత్రమే పూర్తయ్యాయి. పనులు చేయడానికి అంగీకరిస్తే పాత కాంట్రాక్టర్లతోనే చేయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పాత నిర్మాణ సంస్థనే కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మడ్డువలస పనుల ఒప్పంద కాలపరిమితి ఈ ఏడాది జూన్ నాటికే ముగిసిన నేపథ్యంలో పనులు చేసేందుకు కాంట్రాక్టరు ముందుకు వస్తే మరో ఏడాది పొడిగించే అవకాశాలు ఉన్నాయని జలవనరులశాఖ అధికారులు చెప్తున్నారు.

మాట్లాడుతున్న కృపారాణి

కూటమి కోతల ప్రభుత్వం

కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల్లో టిడిపి కూటమి ప్రభుత్వం లక్షలాది మందికి కోత పెట్టిందని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల మంది రైతులు ప్రభుత్వం 45 లక్షల మందికే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి, మిగిలిన వారికి కోత పెట్టిందని విమర్శించారు. పథకం కింద రైతులకు రూ.20 వేలు సాయం అందిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు రూ.14 వేలే ఇస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పరిస్థితీ అలానే ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 లక్షల మంది తల్లులకు పథకం రాకుండా చేశారని విమర్శించారు. మహాశక్తితో రాష్ట్రాన్ని అమ్మేయాల్సిందేనంటూ మంత్రి అచ్చెన్నాయుడు చెప్తున్నారని, ఎన్నికల ముందు హామీ ఇచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా? అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చి ఇప్పుడు జిల్లా పరిధిలోనే ప్రయాణాలకే ఉచితమని చెప్పడం మహిళలను మోసం చేయడమేనన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల మానిఫెస్టోలో చెప్పారని, ఆ ఉద్యోగాలు ఎక్కడా? అని ప్రశ్నించారు. ఉద్యోగాలు ఇవ్వలేకపోతే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఇచ్చిన హామీని ఎగ్గొట్టారని ఆమె విమర్శించారు. గ్రామల్లోకి కూటమి నాయకులు వెళ్తే ప్రభుత్వంపై ఏ స్థాయిలో ఆగ్రహం ఉందో తెలుస్తుందన్నారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికలు వస్తే సీట్ల కోసం మూడు పార్టీల మధ్య పోరు ఉంటుందని చెప్పారు. తమకు ప్రాధాన్యం లేదని ఆగ్రహంతో ఉన్న వీర మహిళలు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో అధునాతన సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వానికి సలహా ఇచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రకరకాల కేసుల పేరుతో ప్రతిపక్ష నాయకులను జైళ్లలో వేస్తోందని, అనుకోని సందర్భంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీరినీ జైళ్లలో వేసే పరిస్థితి ఉంటుందన్నారు. కాబట్టి జైళ్లను అధునాతనంగా తయారు చేసే పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదెం వెంకట త్రినాథరావు, రెళ్ల సురేష్, కిల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పిఎం పూర్తికి ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో రీసర్వే పనులను వేగవంతం చేయాలని, ప్రత్యేకంగా జాయింట్ ఎల్‌పిఎం (జాయింట్ ల్యాండ్ పార్సిల్ మ్యాప్) పూర్తి చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఫర్మాన్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు, మండల మండల సర్వేయర్లతో సోమవారం సమీక్షించారు. రీ సర్వే రెండో విడతకు ఎంపికైన 49 గ్రామాల్లో నిర్దిష్ట గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పూర్తయిన గ్రామాల్లో తలెత్తిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. రీ సర్వేలో పెండింగ్‌లో దరఖాస్తులు, పిజిఆర్ఎస్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మూడో దశలో మిగిలిన గ్రామాల్లో గ్రామ, ప్రభుత్వ భూములకు సరిహద్దులు సెప్టెంబరు 30లోగా నిర్ణయించాలని స్పష్టం చేశారు. జాయింట్ ఎల్‌పిఎంల సమస్యను అత్యల్ప రుసుం రూ.50తో పరిష్కరించే అవకాశం కల్పించిందని, ఈ విషయమై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వజ్రోత్సవాల్లో 75 ఐకాన్స్ ఏర్పాటు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

1950లో శ్రీకాకుళం జిల్లా ఏర్పాటయ్యిందని, ఈ నెల 13 నుంచి వజ్రోత్సవాలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన సోమవారం మాట్లాడారు. శ్రీకాకుళం ఔన్నత్యాన్ని చాటి చెప్పే విధంగా వజ్రోత్సవాలు నిర్వహించాలని చెప్పారు. హెరిటేజ్, గొట్టాబ్యారేజీ నిర్మాణం, పొందూరు ఖాదీ, పలాసలో జీడిపప్పు ఫ్యాక్టరీ ఏర్పాటు, చరిత్ర కలిగిన ఆలయాలు, తదితర వాటిపై వివరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే వివిధ కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 75 ఐకాన్స్ అంటే ఆయా ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉన్న ఐటమ్స్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. వజ్రోత్సవాల్లో శ్రీకాకుళం చరిత్ర వివరించాలని, జిల్లాలోని ఆయా ప్రాంతాల ప్రాచుర్యం, జిల్లాలోని ప్రముఖులు, నియోజకవర్గంలో కొన్ని స్థలాలను గుర్తించి అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వచ్చే వివిధ రకాల దరఖాస్తులను పరిశీలించి ప్రజలకు సేవలందించాలని అధికారులను ఆదేశించారు. కార్యాలయాల్లో క్యూ ఆర్ కోడ్ డిసిప్లే చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

జిల్లాపై వీడియో పోటీలు

జిల్లా ఏర్పాటై 75 ఏళ్ల శుభవేళలో జిల్లా అభివృద్ధి, ప్రత్యేకతలపై సమగ్రమైన అవగాహన కలిగించే వీడియోల తయారీకి సోషల్ మీడియా ఇన్‌ఫ్లువెన్సర్లతో ప్రత్యేక పోటీ నిర్వహించనున్నారు. జిల్లా అభివృద్ధి, సంస్కృతి, ప్రకృతి సౌందర్యం, చారిత్రక ప్రాముఖ్యత తదితర అంశాలను హైలైట్ చేసేలా లాండ్‌స్కేప్ ఫార్మాట్‌లో మూడు నిమిషాల నిడివి కలిగిన వీడియోను రూపొందించాలని సూచించారు. వీడియోలను ఆగస్టు 9 ఉదయం 11 గంటల లోపు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ మెయిల్ ఐడికి dsdosrikakulam@apssdc.in పంపాలన్నారు. ఉత్తమంగా రూపొందించిన వీడియోలకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.పదివేలు అందజేస్తామన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- 'మీకోసం'కు 140 అర్జీలు
- పరిష్కారానికి ప్రత్యేక దృష్టి : కలెక్టర్

వికలాంగునితో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వినతిపత్రం ఇస్తున్న మధ్యాన భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలకు ఏడు నెలల పెండింగ్ బిల్లులు, వంట కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం నిర్వహించిన మీకోసంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పులు చేసి వండిపెట్టిన కళాశాలల వంట కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకంలో పనిచేస్తున్న వారు అట్టడగు వర్గాలకు చెందినవారని, రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాల్లోని మహిళలని అన్నారు. నెలకు రూ.మూడు వేలు వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదని వివరించారు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతున్నాయని, నెలల తరబడి మెనూ బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉండటం వలన కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. యోగా డే రోజు విద్యార్థులకు ఉప్మా వండి పెట్టినందుకు రూ.6 మెనూ ఛార్జీ ఇస్తామని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా కార్మికులకు ఇప్పటి వరకు మెనూ ఛార్జీలు చెల్లించలేదని వివరించారు. మెగా పేరెంట్స్ డే రోజున తల్లిదండ్రులకు భోజనాలు పెట్టినందుకు రూ.8.57 పైసలు మెనూ ఛార్జీలు ఇస్తానని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా ఇప్పటి వరకు చెల్లించలేదని తెలిపారు. అక్షయపాత్ర మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్న చోట రద్దు చేసి కార్మికులతోనే పథకాన్ని కొనసాగించాలని కోరారు. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.పది వేలు వేతనం ఇవ్వాలని కోరారు. వంటచేసేటప్పుడు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, పాఠశాల, కళాశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు వంట షెడ్లు, తాగునీరు కల్పించాలని, గ్లౌజ్‌లు, మాస్క్‌లు, యూనిఫారలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో యూనియన్ నాయకులు ఎ.రాధ, వి.లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, పి.పవిత్ర పాల్గొన్నారు.

ఎరువుల కొరత సమస్య పరిష్కరించాలి

ఖరీఫ్ సీజనల్‌లో వ్యవసాయానికి అవసరమైన యూరియా, డిఎపి లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, జిల్లా వైసిపి అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యాన వైసిపి నాయకులు మీకోసంలో వినతిపత్రం అందజేశారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎరువులు అందజేయడంలో రాజకీయ జోక్యం నివారించాలని అధికారులను కోరారు. నారా యణపురం, తోటపల్లి, మడ్డువలస ప్రాంతాల్లో శివారు భూములకు సాగునీరు అందటం లేదన్నారు. అలాగే సాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డి శాంతి, నాయకులు కంభా రవిబాబు, చిన్తాడ రవికుమార్ పాల్గొన్నారు.

నేరుగా వృద్ధులు, వికలాంగుల వద్దకు..

సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వృద్ధులు, వికలాంగుల అర్జీదారుల వద్దకు నేరుగా వెళ్లి కలెక్టర్ సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు విని వినతులు ఆన్‌లైన్ చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు చేశారు. మెళియాపుట్టికి చెందిన రేఖాను లక్ష్మి తన రేషన్ కార్డుకు ఆదాయ పన్ను చెల్లింపు వ్యక్తి చేరిపోయారని, నిరు పేదలమైన తాము ప్రభుత్వ పథకాలు అందక ఇబ్బంది పడుతున్నామని వివరించారు. వారసత్వ భూమి 1బి మార్పు కోసం అనేకసార్లు దరఖాస్తు చేసుకున్నా సమస్య పరిష్కారం కాలేదని కొత్తూరుకు చెందిన పొగిరి అన్నపూర్ణ వినతిపత్రం అందజేసింది. మొత్తం 140 అర్జీలు మీకోసంకు వచ్చాయి. కార్యక్రమంలో జెసి అహ్మద్ ఫర్మాన్‌ఖాన్, డిఆర్ఒ వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు వస్తే ఖండించాలి

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

మాట్లాడుతున్న అప్పలరాజు

'మీపై ఆరోపణలు వస్తే పత్రికాముఖంగా ఖండించాలే తప్ప అలా కాకుండా నాపై దూషణలు చేస్తూ నా జోలికి రావడం సరికాదు' అని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. స్థానిక ప్రగతి భవన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఒక ఛానల్‌లో ఎమ్మెల్యే గౌతు శిరీష భర్తపై అభియోగాలు వస్తే తన పేరుతో దూషించడం ఏమిటని ప్రశ్నించారు. పశువు, సైకో అంటూ ఇష్టమెచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. శిరీష భాష, సంస్కారం, పద్ధతి చూస్తే ఎమ్మెల్యేగా పనికిరాదని అన్నారు. ఆమె భాష వారి కుటుంబ సభ్యులకు కూడా నచ్చదన్నారు. 60 ఏళ్ల తాత, తండ్రి పాలన అంటారని, ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నల్లబొడ్లూరు, ఉజోడుమెట్టపై తనపై ప్రతిసారీ చేస్తున్న ఆరోపణలపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరా రు. ఓడిపోయాడు అంటూన్నావని, నీలా నీచ రాజకీయాలు చేయలేకే ఓడిపోయానని వ్యాఖ్యానించారు. తాను రాష్ట్ర ప్రభుత్వ పాలసీలపై మాట్లాడుతున్నానని తెలిపారు. రాజకీయాలు హుందాగా చేయాలని సూచించారు. నాతో అభివృద్ధి కోసం పోటీ పడాలని, నీచ ఆరోపణలతో కాదని హితవుపలికారు.

మధ్యవర్తిత్వమే మార్గం

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మాట్లాడుతున్న హరిబాబు

కోర్టుల్లో దాదాపు ఏడేళ్ల పాటు న్యాయ వివాదాలు నడుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు మధ్యవర్తిత్వం (మెడియేషన్) ఉత్తమ మార్గమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. 90 రోజుల మీడియేషన్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం మాట్లాడారు. మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయవాదులు కక్షిదారులకు అనుకూలంగా వ్యవహరించాలని అన్నారు. కోర్టు వెలుపలే పరస్పర రాజీలకు ప్రయత్నించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు చట్ట సహాయాన్ని పొందేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇరు గ్రూపులకు మధ్యవర్తిత్వం వల్ల న్యాయం జరుగుతుందని అన్నారు.

ఐఎంఎల్ డిపోను విడగొట్టొద్దు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఒంటి కాలిపై నిల్చొన్న హమాలీలు

ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోని విడగొట్టొద్దని, కార్మికుల పొట్టలు కొట్టొద్దని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మా పొట్టలు కొట్టొద్దు అంటూ డిపో వద్ద సోమవారం ఒంటికాలుపై హమాలీలు నిల్చొని నమస్కారం చేస్తూ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలన్నారు. దళిత కుటుంబాల నుంచి జాతీయ రహదారి పక్కన కోట్లాది రూపాయలు విలువ చేసే నాలుగెకరాలు భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ప్రభుత్వం తీసుకొని ఎచ్చెర్లలో బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రభుత్వం భూములిచ్చిన దళిత కుటుంబాలు వారికి కార్మికులుగా, హమాలీలుగా ఉపాధి కల్పించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు డిపోలో 80 మంది హమాలీలుగా లోడింగ్, అన్ లోడింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నామని అన్నారు. ఎచ్చెర్లలో ప్రభుత్వ సొంత గొడౌన్ల ద్వారా మద్యం సరఫరా చేస్తుంటే అదనంగా టెక్కలిలో మరో డిపో ప్రైవేట్ గోడౌన్ అద్దెకు తీసుకొని ప్రారంభించడం సరికాదన్నారు. డిపోను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగారాజు, టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కె.వి.రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పలాస

ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజుపై కులంపేరుతో బురదరాజు అంటూ, వ్యక్తిగతంగా పశువు అంటూ వ్యాఖ్యలు చేస్తూ అవమానానికి గురిచేస్తున్నారని, ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైసిపి పలాస నియోజకవర్గస్థాయి నాయకులు కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో సిఐ పి.సూర్యనాయణను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపికి చెందిన దున్న బాలకృష్ణ ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడితే నోటీస్ ఇవ్వకుండా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ పడేశారన్నారు. రాజకీయాల్లో నాయకులపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సహజమేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ప్రతి నాయకుడూ మాజీ సిఎం జగన్‌ను సైకో అని సంభోదిస్తున్నారని, అలా అని ఎంత మందిని అరెస్టు చేశారో చెప్పాలని కోరారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతుందని, రెండు పార్టీలకు సమాన న్యాయం ఉండాలని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, బత్తిన హేమేశ్వరరావు, ఉప్పరపల్లి ఉదయకుమార్, శిష్టి గోపి, బి.దుర్యోధన, మచ్చ ధనరాజ్, దువ్వాడ రవి, డొక్కర దానయ్య గుజ్జు జోగారావు పాల్గొన్నారు.

డిసెంబరు 31 వరకు పొడిగింపు

ఎస్ఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కృష్ణమూర్తి, ఎస్ఇ

ఇపిడిసిఎల్ సిఎండి ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదేశాల మేరకు వినియోగదారులు తమ అదనపు విద్యుత్ లోడును డిసెంబరు 31 లోపు స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గడువులోగా అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకున్న వినియోగదారులకు ఫీజులో 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఇదివరకు మార్చి 1 నుంచి జూన్ 30 వరకు మాత్రమే ఈ అవకాశం కల్పించామన్నారు. వినియోగదారుల విజ్ఞప్తి మేరకు ఎపిఇఆర్‌సి మార్గదర్శకాల ప్రకారం గడువును డిసెంబరు చివరి వరకు పొడిగించినట్లు సంస్థ ప్రకటించిందన్నారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణ వల్ల వినియోగదారులకు భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా, ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. విద్యుత్ వినియోగదారుల్లో అవగాహనను పెంచేందుకు శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో వివిధ ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత వినియోగదారులు తమ అదనపు లోడును తక్షణమే క్రమబద్ధీకరించుకొని రాయితీని పొందాలని సూచించారు.

సమస్యలు వింటున్న అదనపు ఎస్‌పి రమణ

ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

అదనపు ఎస్‌పి కె.వి రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించనున్నట్లు అదనపు ఎస్‌పి కె.వి.రమణ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో 48 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు తక్షణమే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. వృద్ధులు, వికలాంగ అర్జీదారుల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా, తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎఎస్‌పి ఆదేశించారు.

మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం

డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఆర్థిక సహాయం లాంటి ఎన్నో ప్రోత్సాహకాలు లభిస్తాయని డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ తెలిపారు. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, వరల్డ్ బ్యాంక్ సహకారంతో జిల్లా మహిళా సమాఖ్యలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఇంకా చేయని చిన్నతరహా యూనిట్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత అందించడమే లక్ష్యమని తెలిపారు. రిజిస్ట్రేషన్ ద్వారా లభించే ప్రయోజనాలు, సబ్సిడీలు, రుణ సదుపాయాలు వంటి అంశాలను సమగ్రమైనవిగా వివరించారు. అర్హత ప్రమాణాలైన పెట్టుబడి పరిమితులు, టర్నోవర్ వివరాలపై ఈ సదస్సులో అధికారులు అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానం, అవసరమైన డాక్యుమెంట్లు, ధ్రువీకరణ ప్రక్రియ తదితర అంశాలపై నిపుణులు కార్యాచరణలో మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్, పరిశ్రమల శాఖ ఐపిఒ కిరణ్, డిపిఎంలు పాల్గొన్నారు.

జోస్టన్ నగర సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

టిడిపితోనే తెలుగుజాతికి ప్రపంచ గుర్తింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి స్థాపనతోనే ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతికి ప్రత్యేక గుర్తింపు లభించిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆయన సోమవారం జోస్టన్ నగరంలో టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు కమ్యూనిటీ ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జారీ చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా ముందుకు తీసుకుపోతున్నారని వివరించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రజలతో పాటు ప్రపంచంలోని తెలుగువారికి తీవ్ర నిరాశ ఎదురైందని, అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. 2029 ఎన్నికల్లో తెలుగువారి ప్రగతి కోసం మరోసారి చంద్రబాబుకే పట్టం కట్టేలా ఎన్నారైలతో పాటు తెలుగుజాతి ప్రతినిధులంతా నిబద్ధతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

7న సురేఖ పాణిగ్రహి సంతాప సభ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడులో ఈనెల 7న సురేఖ పాణిగ్రహి సంతాప సభ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనంలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత విప్లవోద్యమంలో అమరులైన అమరవీరుల స్మరిస్తూ ఆనాడు పాణిగ్రహి ప్రజా ఉద్యమంలో పాల్గొన్నప్పుడు సురేఖ పాణిగ్రహి ఆయన జీవిత సహచరినిగా చేదోడు వాదోడుగా నిలబడ్డారని అన్నారు. ఎర్ర జెండాను సమున్నతంగా నిలబెట్టడంలో ఆమె వంతుగా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సంతాప సభ నిర్వహణ కమిటీ కన్వీనర్ జోగి కోదండరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు కోనేరు రమేష్, అమర్ల బంధుమిత్రుల కమిటీ నాయకులు తామాడ త్రిలోచనారావు, మద్దిల రామారావు, గొరకల బాలకృష్ణ, వంకల పాపయ్య, కుత్తుం దుష్యంత్, మహిళా సంఘం నాయకులు పోతనపల్లి కుసుమ, సామాజిక కార్యకర్త పోతనపల్లి అరుణ, బొడ్డపాడు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి రెండు గోల్డ్ మెడల్స్

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలో స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో జిల్లాస్థాయి యోగాసన స్పోర్ట్స్ కార్యక్రమంలో బొమ్మాళి ఖగేశ్వరరావు విశ్రాంత ఆర్మీ అను వ్యక్తికి రెండు గోల్డ్ మెడల్స్ సంపాదించాడు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం మెడల్స్‌ను అందజేసి సత్కరించారు. ఖగేశ్వరరావు 45 నుంచి 55 ఏళ్లలోపు వ్యక్తులకు యోగాసనం ఇవ్వడంలో బ్యాంక్ బెండు గోల్డ్ మెడల, హ్యాండ్ బ్యాలెన్స్ గోల్డ్ మెడల్ సాధించారు. ఆర్మీలో పనిచేసి నరసన్నపేటలో యోగాపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో టిడిపి సోషల్ మీడియా సమన్వయకర్త బగ్గు అర్చన తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : ఫోన్లు వద్దంటూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

టెక్కలి : నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

ఈ ఫోన్లు మాకొద్దు

- ఐసిడిఎస్ కార్యాలయాలకు సరెండర్
- ప్రభుత్వ తీరును తప్పపట్టిన అంగన్వాడీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మొరాయిస్తున్న ఫోన్లతో పని చేయలేమని అంగన్వాడీ వర్కర్లు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గతంలో ప్రభుత్వం అందజేసిన ఫోన్లను తిరిగి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం సరండర్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు తమకు పైఅధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు అందలేదని తీసుకు నేందుకు నిరాకరించారు. దీంతో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి కలుగజేసుకుని మా సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆన్‌లైన్ వర్క్ చేయలేమని, మాన్యువల్ రికార్డు ద్వారానే సరుకులు అందిస్తామని, అంగన్వాడీలపై అధికారులు ఒత్తిడి తీసుకొస్తే సహించేది లేదన్నారు. ఫోన్లను ఐసిడిఎస్ కార్యాలయంలో విడిచిపెట్టి వెనుతిరిగారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మాతృ వందనం పథకాన్ని అంగన్వాడీలకు అప్పగించొద్దని, కనీస వేతనం రూ.26 వేలు కార్మిక చట్టాల మేరకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రం నిర్వహణకు ఇచ్చిన ఫోన్లతో పోషణ ట్రాక్టరు, బాలసంజీవిని యాప్స్ అమలుకు సపోర్ట్ చేయడం లేదని, లబ్ధిదారులకు ఫొటోక్యాప్చర్, ఒటిపి, ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వడం సాధ్యం కావడం లేదన్నారు. ఈ నిబంధన అమలు చేయటానికి అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరుకులు అన్ని ఒక్కసారిగా రావటం లేదని, నెట్‌సిగ్నల్ సరిగ్గా అందడం లేదని దీంతో సరుకులను లబ్ధిదారులకు అందజేయకపోవడంతో లబ్ధిదారులందరూ నిరుత్సాహానికి గురవుతున్నారని అన్నారు. యాప్‌లన్నింటిని ఒకే యాప్‌గా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌ఆర్‌ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని కోరారు. సెంటర్ నిర్వహణకు 5జి నెట్వర్కుతో పనిచేసే ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీవో ఇవ్వాలని, గ్రాడ్యుటీ జిఒలో మార్పులు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లకు గైడ్లైన్స్ రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ నాయకులు టి.రాజేశ్వరి, సెక్టార్ నాయకులు కె.జ్యోతి, సంధ్యరాణి, అంజలిబాయ్, పద్మజ, పుష్పలత, లక్ష్మీ, జి.రాజేశ్వరి, సూర్యకుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: యాప్ నిబంధనలు తొలగించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు కె.సుజాత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్ మాత్రమే నిర్వహించాలని అంగన్వాడీ ఉద్యోగులు రణస్థలం ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : ఆగస్టు 5 నుంచి ఆన్‌లైన్ వర్క్ చేయలేమని అంగన్వాడీలు తమ ఫోన్లు ఎచ్చెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంకు అప్పగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు వై.విజయలక్ష్మి, చంద్రమౌళి, కనకం, శారద, రాములమ్మ, సరస్వతి, రాధిక పాల్గొన్నారు.

ఆమదాలవలస: అంగన్వాడీ జిల్లా సహాయ కార్యదర్శి పంచాది లతాదేవి, ప్రాజెక్ట్ సెక్టార్ కార్యదర్శి పి.భూలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీలు సిడిపిఒ కార్యాలయానికి తమ ఫోన్‌లను అందజేశారు. సోమవారం పట్టణంలోని సిడిపిఒ కార్యాలయంలో సిడిపిఒ అందుబాటులో లేకపోవడంతో డేటాఎంట్రీ ఆపరేటర్ అమర్‌కు అంగన్వాడీలు తమ ఫోన్‌లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు లక్ష్మి సునీత, అమ్మాయమ్మ, భారతి, నాగమణి, లక్ష్మీ, శశికళ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: విధి నిర్వహణలో భాగంగా అంగన్వాడీలకు అందించే ఫోన్ల ద్వారా విధి నిర్వహణ కష్టతరంగా ఉందని, వాటిని తమకు వద్దని టెక్కలి, నందిగాం మండలాల అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐసిడిఎస్ పిఒను సోమవారం ఫోన్లను అందజేశారు. కార్యాలయం ముందు నినాదాలు చేశారు. నెట్‌వర్క్ సౌకర్యం ఉండడం లేదని, సాంకేతిక లోపాలను అధిగమించలేకపోతున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఆదిలక్ష్మి, రమణమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : ఐసిడిఎస్ కార్యాలయానికి అంగన్వాడీలు అందజేసిన సెల్‌ఫోన్ల కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు శిర్ల ప్రసాద్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.వి.హేమలత, ఎస్.అనురాధ, కె.లక్ష్మి, ధనలక్ష్మి, నీరజ, సుదీష్ణ, వి.జయ, రజని, బోడమ్మ, శ్రీలత, మధురవేణి పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గ ఐసిడిఎస్ కార్యాలయానికి అంగన్వాడీలు సెల్‌ఫోన్లు అందజేసిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్షులు ఎం.మంజులాకుమారి, కార్యదర్శి బి.సునీత, బి.చామంతి, కె.సరస్వతి, బొకర సునీత, ఎం.కరుణ, ఆర్.భవాని, ఇందుమతి, ఎస్.నిర్మల, ఆర్.పార్వతి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 260 అంగన్వాడీ కేంద్రాల సెల్‌ఫోన్లను కార్యాలయానికి అందజేశారు. పిఒ, సూపర్‌వైజర్ తీసుకోకపోవడంతో కార్యాలయం ఆవరణలో బాక్స్‌తో విడిచిపెట్టారు.

నరసన్నపేట: అంగన్వాడీ కేంద్రాల్లో ఫోన్ ద్వారా యాప్‌ల నిర్వాహణ రద్దు చేయాలని అంగన్వాడీ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద సిఐటియు నాయకుల ఆధ్వర్యాన సెల్‌ఫోన్లను అందజేశారు.

రణస్థలం : ఫోన్లతో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఆమదాలవలస : సిడిపిఒ కార్యాలయం వద్ద ఫోన్‌లను పెట్టెలో వేస్తున్న అంగన్వాడీలు

వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

వేధింపులు ఆపాలని వినతి

పలాస : ఆశాలపై అధికారులు, ఎఎన్‌ఎంల వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. పిహెచ్‌సి అధికారులకు సిఐటియు ఆధ్వర్యాన కాశీబుగ్గ నర్సిపురం అర్బన్ పిహెచ్‌సిలో అధికారులకు వినతిపత్రం సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశాలకు ఒక జాబ్ చార్ట్ ఉందని అన్నారు. అదికాకుండా అదనపు పనులు అప్పగిస్తూ... వేధించడం సరికాదన్నారు. వేక్సిన్ కిట్లు తెమ్మని ఒత్తిడి చేయడం, అదనపు సర్వేలు అప్పగించడం వంటి పనులు చెబుతున్నారని అన్నారు. చేయమని చెప్తే దుర్భాషలాడడం, వేధింపులకు పాల్పడడం వంటి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఎటువంటి వేధింపులు జరిగినా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సభిత పాత్రో, ఎల్.లక్ష్మి, జ్యోతి మహంతి, పుణ్యవతి, బి.స్వాతి, సుందరి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

పోలాకి: పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు ఎఎస్‌ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు, ముగ్గురు గ్రామ మహిళా పోలీసులు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఎస్ఐ జి.రంజిత్ దుశ్శాలువ కప్పి సన్మానించారు. ముఖ్య అతిథులుగా కోటబొమ్మాలి ఎస్ఐ సత్యనారాయణ, శ్రీకాకుళం వన్ టౌన్ ఎస్ఐ జగన్నాథరావు పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో తాను ఇదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేసినట్లు గుర్తి చేశారు.

కళాశాలల సమీపంలో పెట్రోలింగ్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నగరంలోని వివిధ కళాశాలలు పరిసరాల్లో పోలీసు సిబ్బందితో ప్రత్యేక పోలీసు పెట్రోలింగ్ సోమవారం నిర్వహించారు. ఈవిటిజింగ్, ఆకతాయిలను నియంత్రించే చర్యలు చేపట్టి, జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. పోలీసులు, శక్తీ టీమ్ సిబ్బంది విద్యాసంస్థల పరిసరాలు, సమీపంలోని దుకాణాలు, పాన్ షాప్స్ వద్ద పొగాకు ఉత్పత్తులు, గంజాయి విక్రయాలపై చర్యలు చేపట్టారు. వాహనాలు తనిఖీ చేపట్టి ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ప్రధాన చెక్ పోస్టులు, రహదారి మార్గంలో గంజాయి, మద్యం అక్రమ రవణాని అరికట్టే దిశగా ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, త్రిపుల్ డ్రైవింగ్, పరిమితికి మించి అతివేగం వాహనాలు నడపరాదని సూచించారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలు, సరైన వాహన రికార్డులు లేని వారికి పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు.

వాహనలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజల ధనాన్ని అదానికి అప్పగించే కుట్రలో భాగంగా ప్రభుత్వం తెచ్చిన స్మార్ట్ మీటర్లను ప్రజలు తిప్పికొట్టాలని సిపిఎం కార్యదర్శి ఎన్.గణపతి, నాయకులు తెప్పల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. మండలంలోని మాకన్నపల్లి, చిన్నమాకన్నపల్లి, గొల్ల మాకన్నపల్లి గ్రామాల్లో సోమవారం ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్పొరేట్ల లాభల కోసం ప్రజలను బలిచేస్తారా? అని ప్రశ్నించారు. సర్, ఇంధన ఛార్జీలు పేరుతో ఇప్పటికే వేస్తున్న విద్యుత్ బిల్లుల భారం ప్రజలు మోయలేకపోతున్నారని అన్నారు. పెంచిన విధ్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.రాజు, ఎం.రాజు, జుత్తు లోకనాథం, జుత్తు సంతోష్, జుత్తు రాజారావు, జి.నీలకంఠం, టి.సత్యవతి, బి.సాయమ్మ, టి.చిన్నపిల్ల పాల్గొన్నారు.

సరిపడినన్ని ఎరువులు సరఫరా చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

రైతులకు ఎరువులు సక్రమంగా సరఫరా చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరిపడినన్ని ఎరువులు ఇవ్వాలని అన్నారు. రైతులకు ఎకరాకు 25 కేజీలు చొప్పున యూరియా ఇస్తామనడం సరికాదన్నారు. వ్యాపారస్తులు అధిక ధరలకు అమ్ముతూ ఎరువులతో పాటు ఫెర్టిలైజర్స్, దుబ్బుగులుకుల వంటివి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. దీంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతుందని అన్నారు. అధికారులు స్పందించి ఎరువులను రైతులకు రైతు సేవ కేంద్రాల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు ఉన్నారు.

మాట్లాడుతున్న మోహనరావు

సన్మానిస్తున్న విప్, గ్రామస్తులు

బదిలీ... మరో మజిలీ

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ మరో మజిలీ లాంటిదని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని ప్రగడపుట్టుగ ఎంపిపి పాఠశాలలో గత తొమ్మిదేళ్లుగా సేవలందించిన ఉపాధ్యాయులు డి.నీరజ బదిలీపై వెళ్లిన సందర్భంగా గ్రామస్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసినా జ్ఞానం చిమ్మే దీపస్తంభంలా ఉంటారన్నారు. వారి సేవలు మరో కొత్త తరం ఆవిష్కరణలకు నాంది పలుకుతాయని తెలిపారు. ఇక విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎంఇఒ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సేవలను ప్రశంసిస్తూ రేపటి తరం భవిష్యత్ ఉపాధ్యాయుల చేతిలో ఉందని, విజయవంతమైన ఎంతోమంది వెనుక ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుడుగూరు బాలకృష్ణ, గ్రామ యువజన సంఘం అధ్యక్షుడు కింగ్, కార్యదర్శి మిన్నారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, బలరాముమూర్తి, విద్యాకమిటీ చైర్మన్ ముత్యాల కూర్మారావు, గ్రామస్తులు శంకరరావు, కొర్రాయి వాసుదేవ్, బదకల ప్రసాద్, ముత్యాల రామకృష్ణ, పండి విజయ్‌కుమార్, మాదిన కరుణబాబు, చందాన తేజేశ్వరరావు, పండి సత్యనారాయణ, బదకల ఎర్రయ్య, పిరియా సత్యం, బల్లెడ రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

లావేరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగానే గ్రామాల్లో సమస్యలు స్వయంగా తెలుసుకొని వాటి పరిష్కారానికే నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సోమవారం పెదలింగాలవలసలో నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వెంకటాపురం నుంచి పోతయ్యవలస గ్రామానికి రూ.1.70 కోట్లు వ్యయంతో నిర్మించిన బిటిరోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్దలింగాలవలస గ్రామంలో ఇంటింటికి తాగునీరు అందించేందుకు జెజెఎం నుంచి రూ.1.32 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. స్థానిక ప్రజల కోరిక మేరకు ఎస్‌సి సామాజిక భవనం తక్షణం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే పన్నెండు సిసి రోడ్లు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పోతయ్యవలస నుంచి బరిణికం మీదుగా అదపాక రోడ్డు వరకు బిటిరోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. నియోజకవర్గంలో గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, బిజెపి అధ్యక్షుడు ఉుకలాపు అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, మాజీ జెడ్‌పిటిసి పి.మధుబాబు, తహశీల్దార్ జిఎల్ఇ శ్రీనువాసరావు, ఎంపిడిఒ పి. వెంకట రాజు, కూనపల్లి దాము, లంకరం బాబు, బూటు సత్తిబాబు, శంబాన రమేష్, సర్పంచ్ ఉుకలాపు యశోద, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఏడాదిన్నరగా సిఆర్‌పి విధులకు గైర్హాజరు

పట్టించుకోని మండల విద్యాశాఖాధికారులు

పొందూరు: ఎటువంటి అనుమతి లేకుండా, సెలవు దరఖాస్తు లేకుండా ఒక్కరోజు విధులకు డుమ్మా కొడితే చాలు సంబంధిత ఉద్యోగి నుంచి ఉన్నతాధికారులు సంజాయిషి కోరుతారు. అలాంటిది ఎటువంటి సెలవు దరఖాస్తు లేకుండా సుమారు ఏడాదిన్నరగా సిఆర్‌పి విధులకు గైర్హాజరైతే మండల విద్యాశాఖాధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సిఆర్‌పి విధులకు హాజరుకాకపోవడంతో ఆయా క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో ఇబ్బందులు నెలకొన్నాయి. మండలంలోని లోలుగు క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని సిఆర్‌పిగా (సిఆర్‌ఎంటి) కాంట్రాక్ట్ పద్ధతిలో ఉషాబాల విధులను నిర్వహించేది. కాని 2024 ఏప్రిల్ నెల నుంచి మెడికల్ లీవ్ పెట్టిన ఆమె తరువాత ఎటువంటి సమాచారం, సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరయ్యారు. దీనిపై మండల విద్యాశాఖాధికారులకు నోటిమాటగా నైనా తెలియజేయకుండా సుమారు 16 నెలలుగా విధులకు హాజరుకాలేదు. సెలవు పెట్టకుండా 16 నెలలుగా విధులకు గైర్హాజరైనా మండల విద్యాశాఖాధికారులు ఆమెకు షోకాజ్ నోటీసు కూడా జారీ చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో యాప్‌లు, విధులు సిఆర్‌పిలే నిర్వహిస్తుంటారు. అటువంటి సిఆర్‌పి లేకపోవడంతో క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో చాలా ఇబ్బందులు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ క్లస్టర్ బాధ్యతను వేరే సిఆర్‌పికి అప్పగించినప్పటికీ రెండు క్లస్టర్ల బాధ్యతలను నిర్వహించడం ఆయా క్లస్టర్ సిఆర్‌పికి భారంగా మారుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి 16 నెలలుగా విధులకు గైర్హాజరైన సిఆర్‌పిని తొలగించి నూతన సిఆర్‌పి నియామకం జరపాలంటూ పలువురు కోరుతున్నారు.

ఎస్‌ఎస్‌ఎ అధికారులకు తెలియజేశాం

లోలుగు క్లస్టర్ సిఆర్‌పి 16 నెలలుగా ఎటువంటి సెలవు దరఖాస్తు లేకుండా విధులకు గైర్హాజరైనది వాస్తవమే. ఈ విషయాన్ని ఇప్పటికే ఎస్‌ఎస్‌ఎ అధికారులకు సమాచారం ఇచ్చాం. సిఆర్‌పికి నోటీసులు పంపించేందుకు ప్రయత్నిం చిన్నటికీ ఆమె అడ్రస్ తెలియలేదు. నూతన సిఆర్‌పి నియామకంపై ఎస్‌ఎస్‌ఎ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- పట్నాన రాజారావు, ఎంఇఒ


వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం టౌన్: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.భీమారావు కలెక్టర్‌ను కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు సమర్పించారు. జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. హెల్త్ కార్డులు, ఆరోగ్య బీమా అందించాలని, మీడియ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మిక బీమా వర్తింజేయాలన్నారు. రైళ్లలో, ఎసి బస్సుల్లో రాయితీ కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.నర్సింగరావు, ఉపాధ్యక్షుడు డి.నందికేశ్వరరావు, కంగు మన్మథరావు, ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, శేఖర్, శివశంకర్, ఆర్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

గంజాయితో ఆరుగురు అరెస్టు

ఆమదాలవలస : పట్టణంలోని వన్వే ట్రాఫిక్ జంక్షన్ వద్ద గంజాయి చాక్లెట్లను తరలిస్తున్న ఆరుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆమదాలవలస పోలీసులు దాడులు చేయగా శ్రీకాకుళం రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్న వ్యక్తులను పట్టుకుని వారిని ఆరా తీయగా వారి వద్ద 15 గంజాయి చాక్లెట్లను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ 15 గంజాయి చాక్లెట్లు సుమారు 90 గ్రాములు బరువు ఉంటాయని తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం నిందితులు వివరాలు ఇలా ఉన్నాయి. సెవెన్‌రోడ్ జంక్షన్ సమీపంలో గల సారంగ డోల వీధికి చెందిన సిరిగిడి శ్రీనివాసరావు, కటుమల తరుణ్ కుమార్, బొబ్బాడి మణి కృష్ణ, వంజరాపు భార్గవ్, శ్రీకాకుళం దమ్మల వీధికి చెందిన ఫరీద్ ఖాన్, శ్రీకాకుళం రెల్లివీధికి చెందిన జలగడుగుల ప్రసాద్ ఈ గంజాయి చాక్లెట్లను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సోంపేట: మండలంలోని పలాసపురంలో సోమవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 950 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన గార అప్పన్న ఇంట్లో అనధికారికంగా రేషన్ కార్డుదారుల వద్ద కొనుగోలు చేసిన బియ్యం ఉన్నాయన్న సమాచారంతో ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు, ఆర్ఐ కిరణ్, విఆర్‌ఒ పి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో నాగుపాము

వజ్రపుకొత్తూరు: మండల కేంద్రంలోని వజ్రపుకొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాగుపాము హల్‌చల్ చేసింది. దీంతో ఆరోగ్య వైద్య సిబ్బంది భయ భ్రాంతులకు గురైయ్యారు. స్థానికంగా ఉన్న కొంతమంది వ్యక్తులు అక్కడికి చేరుకొని పాముని బయటకు పంపించే ప్రయత్నం చేశారు. అయినా పాము బుసలు కొడుతూ హల్‌చల్ చేసింది. దీంతో ప్రమాదం పొంచి ఉందన్న కారణంలో పామును హతమార్చారు. కాగా ఆస్పత్రి పరిసరాల్లో పిచ్చి మొక్కలతో పాటు పెద్ద పెద్ద పాములు పుట్టలు దర్శనం ఇస్తున్నాయి.

హతమైన నాగుపాము

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాకుళం రూరల్: గార మండలం కొర్ని గ్రామంలో చమళ్ల సాయి వికాస్ ప్రమాదానికి గురైన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దోమల మందును స్ప్రే చేయిస్తున్న వైద్య బృందం

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని గిరిజన గ్రామాల ప్రజలు వివిధ రకాల జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సాహితీ ప్రియదర్శిని సూచించారు. సోమవారం వెన్నెలవలస గిరిజన గ్రామంలో ఆమె వైద్య బృందంతో కలిసి మలేరియా దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 11 ఇళ్ల పరిసర ప్రాంతాల్లో 'సైపినోత్రిన్' అనే మలేరియా నివారణ రసాయన ద్రావణాన్ని పిచికారీ చేయించారు. జూన్‌లో ఇదే గ్రామంలో ఒకసారి స్ప్రేయింగ్ చేసినట్టు తెలిపారు. ఇప్పుడు రెండవసారి చర్యలు చేపట్టడం జరిగినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా మలేరియా అధికారుల పర్యవేక్షణలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే వైద్యశాఖ సూచించిన ఆరోగ్య నియమాలను తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మోహనరావు, వైద్య సిబ్బంది ఎం. మోహనరావు, జి.సూర్యం, ఈశ్వరమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తాడివలసలో సర్పంచ్ తమ్మినైన మణెమ్మ ఆధ్వర్యంలో సోమవారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 67 మందికి పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో పలు రకాల సమస్యలతో బాధపడుతున్న 18 మందిని జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తోలాపిలో కింతలి పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 200 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'దువ్వాడ' పరామర్శ

ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడు తున్నారని వారిని సోమవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పరామర్శించారు. మండలంలోని కూర్మనాథపురం, అక్కురాడ తారకేశ్వరి, బన్నువాడ, సనపల రమణయ్య, గోపినాథపురంలో నంబూరి భాస్కరరావు మాస్టర్ కుటంబ సభ్యులు పరామర్శంచి సంతాపం తెలిపారు. అనంతరం సంతబొమ్మాళిలో సీనియర్ నాయకులు శివ్వాల తవుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారికి రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. శివరాంపురంలో వాడరేవు ధర్మారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కలిసి రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దివ్వెల మాధురి, అక్కురాడ తాతారావు, కల్లూరి పాపారావు, కర్రి లక్ష్మణరావు, జగన్నాథం, దినేష్, నరేంద్ర, నంబాల కృష్ణ పాల్గొన్నారు.

స్ఫూర్తిగా నిలిచారు

కవిటి: మత్స్యకార కుటుంబంలో పుట్టి, స్వయంకృషితో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన యువకులు ప్రస్తుత యువతకు స్ఫూర్తిగా నిలిచారని జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ బైపిల్లి ఈశ్వరరావు కొనియాడారు. కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన కర్రి దిలీప్, వంక ప్రకాష్, చీకటి లక్ష్మణమూర్తికి భట్టివానిపాలెంలో సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎటువంటి అక్షరాస్యత లేని కుటుంబాల నుంచి వచ్చిన ఈ యువకులు తమ ప్రాంతం, కుటుంబం స్థితిగతులు గుర్తించి అకుంఠిత దీక్షతో పోటీ పరీక్షలకు సిద్ధమై అందులో విజయం సాధించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వారు భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గంతి మోహన్, బైపిల్లి నేతాజీ, చీకటి లక్ష్మణ్, చీకటి కృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నిమిషాల్లో కుల ధ్రువీకరణ పత్రం

ప్రజాశక్తి- రణస్థలం

సాధారణంగా ఒకసారి కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్న తర్వాత దాని అవసరం మళ్లీ మళ్లీ వస్తూ ఉంటుంది. ఉద్యోగాల కోసం, చదువుల కోసం, ప్రభుత్వ పథకాల కోసం ఇలా చాలా సందర్భాల్లో దీని అవసరం ఉంటుంది. గతంలో ఒకసారి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం మళ్లీ కావాలంటే చాలా రోజుల సమయం పట్టేది. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఈ ప్రక్రియను సులభతరం చేసింది. ఈ కొత్త విధానం గతంలో కుల ధ్రువీకరణ పత్రం పొందిన వారికి మాత్రమే వర్తిస్తుంది. అంటే ఒకసారి కులం నిర్ణయించబడిన తర్వాత అది మారదు కాబట్టి, పాత రికార్డుల ఆధారంగా కొత్త సర్టిఫికెట్‌ను సులభంగా జారీ చేయవచ్చు. దీని వల్ల వారం నుంచి 15 రోజుల పాటు వేచి చూడాల్సిన అవసరం ఉండదు. అయితే ఈ విధానం ఎస్‌సి హిందూ సామాజిక వర్గానికి మాత్రం వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. మిగిలిన అన్ని వర్గాల వారికీ ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది.

ఎలా దరఖాస్తు చేసుకోవాలి?

ఈ కొత్త విధానంలో దరఖాస్తు చేయడం చాలా సులభం. మీరు పాత కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉంటే ఈ క్రింది విధంగా కొత్తది పొందవచ్చు. మీ దగ్గరలోని మీ-సేవ కేంద్రాన్ని సందర్శించండి. అక్కడ మీఆధార్ నెంబర్ చెప్తే సరిపోతుంది. మీ పాత రికార్డుల ఆధారంగా కేవలం రెండు నిమిషాల్లోనే మీకు కొత్త కుల ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. ఈ ప్రక్రియ కోసం మీరు రూ.45 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. గతంలో దీనికోసం దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, సంఘం సర్టిఫికెట్, పాత కుల సర్టిఫికెట్, రేషన్‌కార్డు, అఫిడవిట్ వంటి అనేక పత్రాలను సమర్పించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ సమస్యలన్నీ తొలగిపోయాయి. ఈ కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి మీసేవా కేంద్రంలో ఆధార్ నంబర్ చెప్పడం ఒక్కటే సరిపోతుంది.

మొదటిసారి కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే?

మొదటిసారి కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకునే వారికి పాత విధానమే వర్తిస్తుంది.

అవసరమైన పత్రాలు

దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, తండ్రి లేదా తల్లి యొక్క కుల సర్టిఫికెట్ (ఉంటే), రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటో, ఈ పత్రాలను మీ-సేవ కేంద్రంలో సమర్పించి, రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియకు వారం నుంచి 15 రోజుల సమయం పట్టవచ్చు. ఈ పత్రాలు అన్నీ సరిగ్గా ఉంటే త్వరగా పత్రం జారీ అవుతుంది.

మీ-సేవలో కొత్త సేవలు

ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం మీ-సేవ పరిధిలో అనేక కొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

మీ - సేవా కేంద్రం

గతంలో ప్రైవేటు సైట్లలో అందుబాటులో ఉన్న కొన్ని సేవలను కూడా ఇప్పుడు మీ-సేవా పరిధిలోకి తీసుకువచ్చారు.

కొన్ని ముఖ్యమైన సేవలు

రెవెన్యూశాఖ: గ్యాప్ సర్టిఫికేట్, పౌరుని పేరు మార్పు, స్థానికత, మైనార్టీ, క్రిమిలేయర్, నాన్-క్రిమిలేయర్ సర్టిఫికెట్లు, సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్, మానిటరింగ్ సేవలు.

అటవీ శాఖ: వన్యప్రాణుల దాడిలో పరిహారం, సామిల్, టింబర్ డిపోల కోసం దరఖాస్తులు.

ఇతర సేవలు: హిందూ మ్యారేజ్ సర్టిఫికేట్, నాన్-అగ్రికల్చర్ మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్, పాన్ కార్డు సవరణ, ఇసుక బుకింగ్ సేవలు. ఈ కొత్త సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గింది. ముఖ్యంగా కుల ధ్రువీకరణ పత్రం వంటి ముఖ్యమైన పత్రాలను సులభంగా పొందడం వల్ల ప్రభుత్వ పథకాలు, విద్యా అవకాశాలను సకాలంలో పొందడానికి వీలవుతుంది.

ఎంఇఒకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

ఎంఇఒగా రాములు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల విద్యాశాఖ అధికారి-1గా ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.ఎ రాములు అదనపు బాధ్యతలను సోమవారం స్వీకరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఎంఇఒ గెడ్డాపు రాజేంద్రప్రసాద్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. మండల విద్యా వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)లో నిర్వహించిన కార్యక్రమంలో రాములు గెడ్డాపు రాజేంద్రప్రసాద్ నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఎంఇఒ-2 టింగ రాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పైల రవికుమార్, కార్యదర్శి పైడి రామస్వామి నాయుడు, సీనియర్ ఉపాధ్యాయులు సిహెచ్ సుబ్బలక్ష్మి, పి. మోహనరావు, తాండ్ర చంద్ర మనోహర్, బి.ఎ.శివరాజ్, సిహెచ్ నాగేశ్వర్, పొన్నాడ రాధాకృష్ణ, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి తల్లిదండ్రులకు నగదును అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి సిహెచ్ రంజిత్ గడచిన కొన్ని నెలలుగా తలసీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబం ఆర్థికంగా నిస్సహాయ స్థితిలో ఉండటంతో సరైన వైద్యం అందించలేక పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయాన్ని గమనించిన కళాశాల అధ్యాపకులు విద్యార్థి పరిస్థితిపై చలించిపోయి వారంతట వారే ముందుకొచ్చారు. ఉదార హృదయంతో స్పందించిన అధ్యాపకులు అందరూ కలిసి రూ.1.66 లక్షలు సేకరించి కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందర్ చేతులమీదుగా సోమవారం రంజిత్ కుటుంబానికి అందజేశారు. తలసీమియా వ్యాధితో బాధపడుతున్న విద్యార్థికి ఇలా చేయూతనిచ్చిన కళాశాల అధ్యాపకుల సహాయానికి స్థానికులు అభినందనలు తెలుపుతూ విద్యారంగంలో ఇదొక మానవతా మాదిరిగా నిలిచిందని ప్రశంసించారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలోని 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన శ్రీవెంకటేశ్వర కాలనీకి ఎదురుగా కోటపాలేం సర్పంచ్ గొర్లె జగదీశ్వరరావు, లక్ష్మీప్రసన్న, రణస్థలం మాజీ జెడ్‌పిటిసి గొర్లె రాజగోపాలరావు, సౌజన్య దంపతులచే నూతనంగా నిర్మించిన జి.కె.నాయుడు కన్వెన్షన్స్ అండ్ ఫంక్షన్ హాల్ సోమవారం ప్రారంభించారు. ఫంక్షన్ హాల్‌లో మంచి సదుపాయాలతో నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా గొర్లె రాజ గోపాలరావు మాట్లాడుతూ అన్ని వర్గాలవారికి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, అలాగే అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పిఎం ఫీజు మినహాయింపు

ఇచ్ఛాపురం: జాయింట్ ఎల్పీఎంలకు ఆన్‌లైన్ సెట్ డివిజన్ సేవలకు స్వీకరించిన అన్ని దరఖాస్తులకు ఆరు నెలల కాలానికి ఒకసారి ఫీజు మినహాయింపును మంజురు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని తహశీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులందరూ ఈ విషయాన్ని గమనించాలన్నారు. రూ.50 చెల్లించి జాయింట్ ఎల్పీఎం ఆన్‌లైన్ సిట్ డివిజన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత గ్రామ సర్వేయరును సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధిని ఓర్వలేక వైసిపి విమర్శలు

పొందూరు : పింఛన్లను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అసూయ అక్కసుతో వైసిపి నాయకులు అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ హితవు పలికారు. సోమవారం మండలంలోని తొగరాంలో ఇటీవల మంజూరైన వితంతు పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే మండలంలోని శ్రీనివాసాచార్యుల పేటలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి చేతులమీదుగా కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ బగాది నాగరాజు, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస, కొండవలస గ్రామాల్లో నియోజకవర్గ తెలుగు యువత నాయకుడు తాడేల రాజారావు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

పొందూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు స్పౌజ్ వితంతు పింఛన్లును అందజేసిన ఘనత సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎంపిపి కూన ప్రమీల, టిడిపి మండల అద్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అన్నారు. మండలంలో స్పౌజ్ వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన

ఆమదాలవలస : పింఛన్లను పంపిణీ చేస్తున్న నాయకులు

శ్రీరంగనాయకులు, మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, టిడిపి నాయకులు బాడాన శేషగిరి, చిన్నరంగా, మురళీ, ఇఒ మోహన్‌బాబు, శ్రీనివాసరావు, బాల, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

నరసన్నపేట: మండలంలోని పలు కుటుంబాలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం పరామర్శించారు. మాకివలసకు చెందిన యాళ్ల పెంటయ్య, దేశవానిపేట వీధికి చెందిన ముద్దాడ యర్రయ్య కుటుంబ సభ్యులను, సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షులు పిళ్లా నందకిషోర్ నాన్నమ్మ మృతి విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కత్తిరి వెంకటరమణ, సారవకోట పిఎసిఎస్ అధ్యక్షులు సురవరపు తిరుపతిరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అందరికీ స్వచ్ఛమైన తాగునీరు

వజ్రపుకొత్తూరు: ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని క్లస్టర్ ఇన్‌ఛార్జీ రామారావు అన్నారు. మండలంలోని పల్లివూరు పంచాయతీ సెగిడిపేటలో వాటర్ ట్యాంకు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ.18 లక్షలతో పది వేలు లీటర్ల సామర్థ్యం గల మంచినీళ్ల ట్యాంకు నిర్మాణం చేపడుతున్నామని, ఎమ్మెల్యే శిరీష సహకారంతో సిసి రోడ్లు నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. మాజీ ఎంపిటిసి పాపారావు, టిడిపి కన్వీనర్ లంద వాసు పాల్గొన్నారు.

పి4పై అవగాహన

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో బెల్లుపడలో పి4పై లబ్ధిదారులకు టిడిపి నాయకులు రెయ్య జానకిరామ్ సోమవారం అవగాహన కల్పించారు. నిరుపేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పి4 విధానాన్ని ముందుకు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో కొండ శంకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆర్‌పిలు నాగమణి, భారతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీదీక్షితకు అభినందనలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం వెంకటేశ్వర డ్యాన్స్ అకాడమీకి చెందిన బల్లెడ శ్రీదీక్షిత రాష్ట్రస్థాయి నృత్య పోటీలకు ఎంపికైందని చైర్మన్ వెంకటేశ్వర పట్నాయక్ తెలిపారు. ఇటీవల విశాఖలో నిర్వహించిన భారతీయ విద్యా కేంద్రం సంభాగ్ స్థాయిలో ఆరో తరగతి చదువుతున్న శ్రీదీక్షిత నృత్య పోటీలో రాణించిందన్నారు. ఈ మేరకు సోమవారం ఆమెను అభినందించారు.

బాబు హామీలపై నిలదీయాలి

నరసన్నపేట : మాట్లాడుతున్న ఎంపిపి మురళి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీయాలని వైసిపి నాయకులు సోమవారం ర్యాలీ చేపట్టారు. మండలంలోని చెట్లతాండ్ర, ఆరికవలస పంచాయతీల్లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షుడు బి.మోహన్‌రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కెళ్ల జగన్నాయకులు పోస్టర్లను పంపిణీ చేశారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో ప్రభుత్వ హామీలను ప్రజలు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నక్క భీమారావు, నాయకులు మార్పు నాగభూషణరావు, పంగ రామయ్య, మోడి భాస్కరరావు, రామారావు పాల్గొన్నారు.

నరసన్నపేట : పట్టణంలోని కొత్తవీధి, హడ్కో కాలనీలో ఎంపిపి ఆరంగి మురళి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రతినిధి చింతు రామారావు, వైస్ ఎంపిపి పాగోటి రాజారావు, గుప్త, ఆర్.అప్పన్న, పొందర చైర్మన్ ప్రతినిధి ఆర్ అప్పన్న, పొట్నూరు సాయిప్రసాద్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : పోస్టర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నాం

పలాస : పోస్టర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని సుమ్మాదేవిలో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు వంకల కూర్మారావు, కుత్తుం లక్ష్మణ్ కుమార్, ఆర్.భాస్కరరావు పాల్గొన్నారు.

లావేరు: కూటమి ప్రభుత్వం పాలనలో సిఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. పోతయ్యవలసలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుని పోస్టర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, పి.మధుబాబు, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ సర్పంచ్ కె.లక్ష్మణరావు, లంక రాంబాబు, బూటు సత్తిబాబు, గొర్లె శ్రీనువాసరావు, కూనపల్లి దాము తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ కొంపెల్ల లక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతున్న కారణంగా ఆయనను పరామర్శించారు